# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక




ఉదయం పరిశీలన..

## సాయంత్రం సమీక్షలు..

- కొనుగోళ్లపై కలెక్టర్ ఫోకస్ 4


సంపుటి : 01 | సంచిక : 178 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 28 మే 2026 | పేజీలు : 4





మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
గురువారం, 28 మే 2026
Mana Chourasta


# మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

- మహిళల ఆర్థిక సాధికారతకు సోలార్ ప్లాంట్‌లు దోహదం
- సంక్షేమం నుంచి స్వావలంబన వైపు మహిళల అడుగులు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** హిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి అన్నారు. బుధవారం జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని రఘునాథపల్లి మండలంలోని అశ్వరావుపల్లి గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సౌర విద్యుత్ ప్లాంట్ శిలా ఫలకాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబులతో కలిసి ముఖ్య అతిథిగా ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి హాజరై ఇందిరా మహిళా శక్తి పథకం కింద నవ భారతి మండల మహిళా సమాఖ్యకు కేటాయించిన ఒక మెగా వాట్ సౌర విద్యుత్ ప్లాంట్ కు శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు మాట్లాడుతూ.. నవ భారతి మండల మహిళా సమాఖ్య సభ్యులను అభినందిస్తూ, మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.గతంలో మండల మహిళా సమాఖ్యకు ప్రభుత్వ సహకారంతో ఒక బస్సును కొనుగోలు చేసి, దానిని ఆర్టీసీకి అప్పగించడం ద్వారా ప్రతి నెల రూ. 69 వేల ఆదాయం పొందుతున్న విషయాన్ని గుర్తు చేశారు.ఈ క్రమంలో ఇప్పుడు ఏర్పాటు చేయనున్న ఒక మెగా వాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా నెలకు లక్ష రూపాయల ఆదాయం సమాఖ్యకు సమకూరే అవకాశం ఉందన్నారు.సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మాణం కానున్న ఈ సోలార్ ప్లాంట్ ద్వారా నాలుగు వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసి, విద్యుత్ సంస్థకు విక్రయించడం ద్వారా ఖర్చులు మినహాయించి, మహిళా సమాఖ్యకు నెలకు గణనీయమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. దీంతో మహిళల ఆర్థిక స్థిరత్వానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగానే కాకుండా వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. మహిళలు తమ కుటుంబాలను పోషించడమే కాకుండా మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని తెలిపారు. ఇదే క్రమంలో గ్రామ మహిళా సమాఖ్యలకు ఎరువుల దుకాణాల నిర్వహణ బాధ్యతలు అప్పగించి, ఎరువులతో పాటు విత్తనాల విక్రయానికి కూడా అవకాశాలు కల్పించేందుకు జిల్లా స్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్, రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఆసరా పెన్షన్ల విస్తరణ వంటి కార్యక్రమాలు మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని చెప్పారు. అలాగే ఒంటరి మహిళలు, వితంతువులకు పెన్షన్లలో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత బలపడాలని పిలుపునిచ్చారు. అదే విధంగా దేవాదుల ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరానికి పంట సాగుకు నీరు అందించామని, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..మహిళా సాధికారతను లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇదే గ్రామానికి చెందిన కనీసం పది మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు స్థిరమైన ఆదాయం అందించడంతో పాటు, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచే దిశగా ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా జిల్లాలో మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాల దుకాణాలను కేటాయించనున్నట్లు వెల్లడించారు. మహిళా సంఘాలకు ఆదాయ వనరులు పెరిగేలా ఈ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఇక మహిళల ఆర్థిక బలోపేతం కోసం జిల్లాలో మహిళా సమాఖ్యలకు పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలను కూడా అప్పగించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహిళల స్వయం సమృద్ధి సాధనలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మహిళా సమాఖ్యలను కేవలం పొదుపు సంఘాలకే పరిమితం చేయకుండా, విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయ సేవలు, ఇంధన పంపిణీ వంటి రంగాల్లో భాగస్వామ్యం కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తదనంతరం గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు మాట్లాడుతూ.. మహిళలు ప్రతి రంగంలో ముందడుగు వేస్తూ ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆర్థికంగా బలపడుతున్నారని, మహిళల సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో భాస్కర్, ఏపిడి నూరుద్దీన్, రెడ్కో వరంగల్ జిల్లా మేనేజర్ మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచి చైతన్య, ఇతర సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





## మాజీ ప్రధాని నెహ్రూకు ఘన నివాళి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతదేశ తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారత నిర్మాత, భారతరత్న స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. దేశ పురోగతికి నెహ్రూ గారు దూరదృష్టితో రూపొందించిన ప్రణాళికలు, ఆయన పాటించిన ప్రజాస్వామ్య విలువలు, శాంతి, విజ్ఞానసాంకేతిక రంగాల అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచిన నెహ్రూ ఆశయాలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని నాయకులు అన్నారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుగు బాలరాజు గౌడ్, సాదం మధుసూదన్ యాదవ్, మోర్తాల ప్రభాకర్, 6వార్డు కౌన్సిలర్ నాని, నాయకులు శివరాత్రి కుమార్, శ్రీధర్ రెడ్డి, చలపతి రెడ్డి, బృంగి సురేందర్, బనుక ప్రభాకర్, ఆరేళ్ల విజయ్, మల్లారెడ్డి, విక్రమ్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను కలిసిన రాంగోపాల్ రెడ్డి



**అక్కన్నపేట, మన చౌరాస్తా :** కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఈ రోజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం మరియు మిల్లర్ల వైఖరి కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన కేంద్ర మంత్రికి వివరించారు. అలాగే మొక్కజొన్న కొనుగోళ్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, నెల రోజులుగా మార్కెట్ యార్డుల్లో రైతులు పడిగాపులు కాస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులకు అవసరమైన గోనె సంచులు సకాలంలో అందించడం లేదని, రైతు సమస్యలను ప్రస్తావిస్తే ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతోందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ తరఫున తగిన పోరాట కార్యక్రమాలు రూపొందించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గోపగోని సహస్రకు ఆకాష్ సన్మానం




**హైదరాబాద్, మన చౌరాస్తా :** పట్టుదల, కృషి ఉంటే విజయం తప్పక వరిస్తుందని నిరూపించింది హైదరాబాద్ మణికొండకు చెందిన గోపగోని సహస్ర. పదో తరగతి పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. పరిమిత వనరులు, పరిస్థితులతోనే పోటీ పడి ఉత్తమంగా నిలిచిన విద్యార్థిని గోపగోని సహస్రకు ప్రముఖ విద్యాసంస్థ ఆకాష్ విశేష సన్మానం చేసింది. సహస్ర 600 మార్కులకు గాను 575 మార్కులు పొంది.. 10కి 10 GPA తో తాను చదివిన శ్రీగాయత్రి ఇ టెక్నో స్కూల్ లో రెండో ర్యాంకు సాధించింది. సహస్ర అసాధారణ విజయాన్ని గుర్తించిన హైదరాబాద్ సన్ సిటీ ఆకాష్ కాలేజీ నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ సూర్య కళారెడ్డి స్వయంగా సహస్రకు ప్రశంసాపత్రం, మెడల్ అందజేసి ఆమె విజయాన్ని కొనియాడారు. తన కుటుంబానికి, గురువులకు కృతజ్ఞతలు తెలిపిన సహస్ర.. ఇకపై ఇంకా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధిస్తానని ఆత్మవిశ్వాసంతో తెలిపింది. సహస్ర అసాధారణ ప్రతిభ చూపడం పట్ల ఆమె తల్లిదండ్రులు అత్యంత సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# వరంగల్ కార్పొరేషన్‌కే అధిక నిధులు

**కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**



**వరంగల్, మన చౌరాస్తా :** కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ సహా రాష్ట్రంలో ఏ కార్పొరేషన్ కు ఇవ్వనన్ని నిధులను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వరంగల్ కార్పొరేషన్ కు ఇచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.వరంగల్ లో బుధవారం జరిగిన ఉపాధ్యాయ ప్రశిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ పాలకుల అవినీతివల్ల ఆ నిధులన్నీ దుర్వినియోగమయ్యాయని మండిపడ్డారు. కేంద్ర నిధుల దుర్వినియోగం, డైవర్షన్ పై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రం ఇంతపెద్ద ఎత్తున నిధులిస్తున్నా కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరువల్లే అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని, కేంద్రం నుంచి మరిన్ని నిధులను రాబడతామనే విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. దీంతోపాటు ఇకపై యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పై, స్థానిక సమస్యలపై ఉధృతంగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏ రాజకీయ పార్టీకైనా ఒక లక్ష్యం ఉంటుంది. ప్రధానంగా అధికారమే అంతిమ లక్ష్యంగా పనిచేస్తాయి. ఆ అధికారం కోసం తమ సిద్ధాంతాలను, విధానాలను కూడా పక్కనపెట్టి పనిచేస్తాయని అన్నారు. లక్ష్య సాధన కోసం అనేక తప్పుడు మార్గాల్లో నడుస్తూః సిద్ధాంతాలను కూడా తుంగలో తొక్కుతాయని అన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలే అందుకు నిదర్శనం. కానీ నాటి జనసంఘ్ నుండి నేటి భారతీయ జనతా పార్టీ వరకు ఎన్నడూ సిద్ధాంతాన్ని పక్కన పెట్టకుండా ఆశయాలను కొనసాగిస్తున్నా ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. కమిట్ మెంట్ బీజేపీ కార్యకర్తల సొంతం అన్నారు. ఏ పార్టీకైనా సిద్ధాంతాలనేవి పునాది లాంటివి. పునాది గట్టిగా ఉంటే ఇల్లు పటిష్టంగా ఉంటుందన్నారు. బీజేపీ సిద్ధాంతాలు పటిష్టంగా ఉన్నాయి కాబట్టే ఇద్దరి ఎంపీల నుండి మొదలైన ప్రస్థానం వరుసగా మూడుసార్లు అధికారంలోకి రాగలిగిందన్నారు. పార్టీ 21 రాష్టాల్లో అధికారంలో కొనసాగుతున్నాం. బెంగాల్, త్రిపుర వంటి కమ్యూనిస్టుల, టీఎంసీ కంచు కోటలను బద్దలు కొట్టి అధికారంలోకి రాగలిగామన్నారు. బీజేపీ నిర్దేశించుకున్న 'కాంగ్రెస్ ముక్త్ భారత్' నినాదాన్ని అమలు దిశగా కొనసాగుతున్నామన్నారు. హామీలిచ్చి మోసం చేసే పార్టీ బీజేపీ కాదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడి అధికారంలో రావడమే బీజేపీ లక్ష్యం అన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విరక్తి పుట్టిందన్నారు. బీఆర్ఎస్ పట్ల ప్రజలకు నమ్మకం లేదు. వాళ్లు ఏ పోరాటాలు చేసినా జనం వాళ్లకు మద్దతివ్వడం లేదన్నారు. అందుకే ఈసారి బీజేపీకి ఓటేసి గెలిపించాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా మహిళలు కాంగ్రెస్ ను ఓడించాలని కంకణం కట్టుకున్నారన్నారు. మహిళలు సెంటిమెంట్ కు ప్రతీక. వాళ్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ పట్ల కసితో ఉన్నారన్నారు. రైతులు సైతం తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. వడ్ల కొనుగోళ్లు లేక రైతులు పడుతున్న కష్టాలను కళ్లారా చూస్తున్నా.. ప్రజలను కలిసి వారిలో నమ్మకం కలిగించడంలో క్షేత్రస్థాయిలో బీజేపీ నాయకులు వెనుకబడి ఉన్నారన్నారు. త్వరలో హన్మకొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు రాబోతున్నాయన్నారు. ఇక్కడ గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కరీంనగర్ కు, వరంగల్ కు పెద్ద తేడా లేదన్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ, అమ్రుత్ 1, 2 కింద కేంద్రం పెద్ద ఎత్తున నిధులిచ్చిందన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద మరో రూ.4600 కోట్లు మంజూరయ్యాయి. ఇవిగాకుండా కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్ టైల్ పార్క్, జాతీయ రహదారుల నిర్మాణం సహా పెద్ద ఎత్తున కేంద్రం నిధులిచ్చిందన్నారు. దురద్రుష్టమేందంటే కరీంనగర్ లో స్మార్ట్ సిటీ నిధులను వినియోగించుకుని అభివృద్ధి చేస్తే, వరంగల్ లో మాత్రం స్మార్ట్ సిటీ నిధులన్నీ డైవర్ట్ అయ్యాయన్నారు. అందుకే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. వీటిపై ఉద్యమాలు చేయడంలో వరంగల్ బీజేపీ నాయకులు వెనుకబడి ఉన్నారన్నారు. వరదలొస్తే హంటర్ రోడ్ మునిగిపోతది. కాజీపేట పరిసరాల్లోని రాంపూర్ డంపింగ్ యార్డ్ (ల్యాండ్‌ఫిల్) చుట్టుపక్కల గ్రామాల ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. దీనిపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం లేదన్నారు. నగర పరిధిలో (ముఖ్యంగా వరంగల్ వెస్ట్, ఈస్ట్ నియోజకవర్గాల్లో) వేలాది మంది అర్హులైన పేదలకు ఇప్పటికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించలేదన్నారు. పూర్తయిన ఇండ్లు కూడా పంపిణీకి నోచుకోక పాడుబడుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన "ఇందిరమ్మ ఇండ్ల" హామీ కూడా క్షేత్రస్థాయిలో ఇంకా వేగం అందుకోలేదన్నారు. పేదల పక్షాన పోరాడటంలో వెనుక బడి ఉన్నాం. హన్మకొండలో కేంద్ర నిధుల భాగస్వామ్యంతో ఇరుకు రోడ్లను విస్తరిస్తున్నారన్నారు. ఆ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం లేదన్నారు.

## ‘ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులను ఎత్తివేయాలి’



**జనగామ, మన చౌరాస్తా :** ప్రముఖ మీడియా విశ్లేషకుడు, విశ్రాంత ఆచార్యులు నాగేశ్వర్ పై ఆంధ్రప్రదేశ్ లోని వివిధ పోలీసు స్టేషన్లలో బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని టీఎస్ యుటిఎఫ్ జనగామ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి చంద్రశేఖర్ రావు, మదూరి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆచార్య నాగేశ్వర్ జర్నలిజం అధ్యాపకుడిగా ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు, సివిల్ సర్వెంట్స్ మొదలు రాజకీయ నాయకుల వరకు వివిధ అంశాలపై శిక్షణనిస్తూ పాలకులు ఎవరైనా నిక్కచ్చిగా, సామాజిక కోణంలో తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. గత, ప్రస్తుత ముఖ్యమంత్రులతో సహా రాష్ట్రంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఏదోఒక సందర్భంలో ఆయన సలహాలు తీసుకున్నవారే. ఒక టివి ఛానల్ ఇంటర్వ్యూలో నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు అసభ్యంగానో, వ్యక్తిగత విమర్శలో కావు. ఆయన వ్యాఖ్యలు నచ్చనివారు ప్రజాస్వామ్యయుతంగా ఖండించవచ్చు. తన వ్యాఖ్యలపై అభ్యంతరాలు వ్యక్తమైన వెంటనే వాటిని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయినా ఆయనపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని ప్రయత్నించడం విజ్ఞత అనిపించుకోదు. ఈ చర్య మీడియా స్వేచ్ఛపై దాడిగానే భావించాల్సి ఉంటుంది. ఇది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జోక్యం చేసుకొని కేసులను ఎత్తివేసి ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని కోరారు.



## బీజేపీ సీనియర్ నాయకుడికి నివాళి

**చిల్పూర్, మన చౌరాస్తా :** చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ముక్కెర గోపాల్ యాదవ్ మరణించగా ఆయన భౌతికకాయానికి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్థివదేహంపై పార్టీ జెండాను కప్పి అంజలి ఘటించారు. గోపాల్ యాదవ్ అంతిమ యాత్రలో పాల్గొన్న పెరుమాండ్ల వెంకటేశ్వర్లు స్వయంగా పాడె మోసి ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్నతో పాటు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మృతునికి నివాళులు అర్పించారు.

## ముల్కనూర్‌లో క్రికెట్ పోటీలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ముల్కనూర్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన భారీ ఎర్ర టెన్నిస్ బంతి క్రికెట్ పోటీలు ఈ నెల 28వ తేదీ గురువారం నుంచి ముల్కనూర్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని పోటీల నిర్వాహకులు వెల్లడించారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల జట్లు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. గ్రామాల వారీగా ఆధార్ గుర్తింపు కార్డు ఆధారంగా మాత్రమే జట్లకు అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి పోటీని 8 ఓవర్ల రూపంలో నిర్వహించనుండగా, అందులో 2 ఓవర్లు ప్రత్యేక అవకాశంగా ఉండనున్నాయని వివరించారు. పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.20 వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. జట్ల ప్రవేశ రుసుమును రూ.1, 000గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. క్రికెట్‌ను అభిమానించే యువత అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. జట్ల నమోదు మరియు మరిన్ని వివరాల కోసం బాలు - 7702794979, రాజేందర్ - 7036111529ను సంప్రదించవచ్చని తెలిపారు.

## పనిచేసే చోట మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలి




**వరంగల్, మన చౌరాస్తా :** జిల్లాలో పని ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మహిళలు వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం వరంగల్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం మరియు పరిష్కార చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు తమ రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, పిల్లలకు చిన్నప్పటి నుంచే లింగ సమానత్వం, పరస్పర గౌరవం నేర్పించాలని అన్నారు. షీ టీం ప్రతినిధి సుజాత మాట్లాడుతూ మహిళలపై ఎక్కడైనా వేధింపులు జరిగినట్లయితే షీ టీంను 8712685142 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం షి బాక్స్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు ఎలా నమోదు చేయాలో వివరించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీల ఏర్పాటు జరుగుతోందని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు జిల్లా స్థాయి కార్యాలయాల్లో 59, మండల, గ్రామస్థాయి కార్యాలయాల్లో 59, ప్రైవేట్ సంస్థల్లో 26 కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డీఎల్ఎస్ఏ అడ్వకేట్ సురేష్ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపుల కేసుల్లో గోప్యత పాటిస్తూ విచారణ చేపట్టాలని, ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఉండాలని వివరించారు. కమిటీలు ఏర్పాటు చేయని సంస్థలకు జరిమానాలు విధించే నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోష్ చట్టానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరణ చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డీబీసీడీఓ పుష్పలత, డీఆర్డీఏ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఎస్టీ రిజర్వేషన్ 50 ఏళ్ల వేడుకలకు సిద్ధం

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో గిరిజన నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువతతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జూన్ 18 నాటికి ఎస్టీ రిజర్వేషన్ అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా నిర్వహించనున్న మహాసభ ఏర్పాట్లపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పి ఎస్) జనగామ జిల్లా ఇన్చార్జి కొర్ర రాజేందర్ నాయక్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనల మేరకు గిరిజనుల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధి కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారం ఎస్టీ రిజర్వేషన్లు కల్పించబడ్డాయని వివరించారు. ఎస్టీ రిజర్వేషన్ సాధనలో జాతి పెద్ద రవీందర్ నాయక్ చేసిన నిరంతర పోరాటం, మరెందరో ఉద్యమకారుల త్యాగాల ఫలితంగానే నేడు గిరిజన సమాజం ఈ హక్కులను అనుభవిస్తోందని గుర్తుచేశారు. గత 50 ఏళ్లుగా రిజర్వేషన్లు గిరిజన సమాజ పురోగతికి ఎంతో దోహదపడ్డాయని, అయితే నేటికీ గిరిజన ప్రాంతాల్లో అనేక సమస్యలు ఉన్నందున హక్కుల పరిరక్షణ కోసం గిరిజనులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.జూన్ 18న జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో నిర్వహించబోయే ఈ మహాసభను విజయవంతం చేసేందుకు గిరిజన సమాజం, యువత స్వచ్ఛందంగా, తండోపతండాలుగా తరలిరావాలని రాజేందర్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్హెచ్పిఎస్ రాష్ట్ర నాయకులు బిక్షపతి నాయక్, జిల్లా నాయకులు గుగులోతు కొమురెల్లి నాయక్, మండల నాయకులు గుగులోతు శ్రీను నాయక్, ధరావత్ దేవస్వామి నాయక్, ఈర్య నాయక్, సోమన్న నాయక్, సుందర్ నాయక్, గుగులోతు భజన్ నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

# దసరా నాటికి ఆస్పత్రి పూర్తి కావాలి



**ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశం**

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గ కేంద్రంలో రూ. 45.50 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి ఆసుపత్రి భవన నమూనా (డిజైన్)ను నిశితంగా పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. రాబోయే దసరా పండుగ నాటికే ఈ అత్యాధునిక ఆసుపత్రి నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తి చేసి, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను, అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయ్యే సమయానికే రోగులకు అవసరమైన అధునాతన వైద్య పరికరాలు, మౌలిక వసతులు సిద్ధం చేయడంతో పాటు, మెడికల్ మరియు పారామెడికల్ సిబ్బంది నియామకాన్ని కూడా పూర్తి స్థాయిలో చేపట్టాలని వైద్య శాఖ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను స్థానికంగానే అందించాలనే ఉద్దేశంతో ఈ 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. కేవలం భవన నిర్మాణానికే పరిమితం కాకుండా, ప్రతీ ఒక్కరికీ సత్వర చికిత్స అందేలా అన్ని రకాల విభాగాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్మాణ పనులను తానే స్వయంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నానని, రాబోయే ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అన్ని ప్రధాన అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బలిదే వెంకన్న, కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.



# ఉదయం పరిశీలన..
# సాయంత్రం సమీక్ష

**ధాన్యం కొనుగోలు పై కలెక్టర్ ప్రత్యేక దృష్టి**

**మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలి**

జనగామ, మన చౌరాస్తా : జిల్లా లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సజావుగా సాగేందుకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఉదయం కొనుగోలు కేంద్రాల పర్యటనల అనంతరం ప్రతీ రోజూ సాయంత్రం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో బుధవారం జరిగిన సమీక్షా లో.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1,52,924 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో ఇప్పటికే 1,44,549 మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించడం జరిగిందని, అలాగే 23,275 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 282 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా 1,22,942 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేయడం జరిగిందని, మొత్తం 572 మంది హమాలీలు ఉన్నారన్నారు. జిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఇంకా వేగం పెంచాలని ఆదేశించారు. ప్రతి మిల్లు, కేంద్రం వారీగా కొనుగోలు వివరాలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు, అలాగే మిల్లుల వద్ద ఎంత అన్లోడింగ్ పెండింగ్ ఉంది అని క్షుణ్ణంగా సమీక్షించారు. మిల్ లకు వచ్చే ధాన్యాన్ని సరిపడా హమాలీ లను పెట్టుకొని త్వరగా అన్ లోడింగ్ అయ్యేలా అధికారులు పర్యవేక్షించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువస్తున్న మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేసి, త్వరగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన ఓపీఎంఎస్ (OPMS) నమోదును ఎప్పటికప్పుడు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రవాణా, గోదాముల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరు పట్ల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో భాస్కర్, మార్క్‌ఫెడ్ డీఎం చంద్రశేఖర్, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, అదనపు డీఆర్‌డీవో నూరుద్దీన్, పౌరసరఫరాల సంస్థ డీఎం హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**